ప్రజాశక్తి
ఆదివారం 28 డిసెంబరు 2025
I
అల్లూరి సీతారామరాజు



డిఎస్‌పి అభిషేక్ బాధ్యతల స్వీకరణ

ప్రజాశక్తి -పాడేరు: అల్లూరి జిల్లా కేంద్రం పాడేరు డీఎస్పీగా నియమితులైన ఆర్ఆర్ వివిఎస్ అభిషేక్ శనివారం తన కార్యాలయం చాంబర్లో బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, పాడేరు సబ్ డివిజన్ పరిధిలో శాంతిభద్రతలను కాపాడుతానని, మహిళలు, చిన్నారుల పట్ల నేరాలు జరగకుండా చూస్తామని తెలిపారు. అదేవిధంగా గంజాయి సాగుపై, రవాణాపై ఉక్కుపాదం మోపుతామని, అటువంటి వారిపై కఠినమైన చట్టపరమైన చర్యలు తీసుకుంటామని తెలియజేశారు.





శ్రామిక ఉత్సవ్ ప్రారంభ సభలో మాట్లాడుతున్న ప్రకాష్ రాజ్

'శ్రామిక్ ఉత్సవ్' ఆరంభం అదుర్స్

-ప్రేక్షకుల్లో జోష్ నింపిన సినీ నటులు ప్రకాష్ రాజ్
-వినోదం, విజ్ఞానం, ఆహ్లాదంతో ఉప్పొంగిన విశాఖ తీరం

ప్రజాశక్తి - గ్రేటర్ విశాఖ బ్యూరో
విశాఖ సాగర తీరంలో శనివారం సాయంత్రం ఆరంభమైన 'శ్రామిక్ ఉత్సవ్' ఆద్యంతం ప్రేక్షకుల నోట 'ఆదుర్స్' అనిపించింది. సిఐటియు ఆలిండియా 18వ మహాసభల సందర్భంగా నగరంలోని ఆర్‌కె.బీచ్ ఏయూ కన్వెన్షన్ సెంటర్ వెనుక ఎగ్జిబిషన్ గ్రౌండ్స్‌లో నిర్వహించిన శ్రామిక్ ఉత్సవ్‌ను సినీ నటుడు ప్రకాష్‌రాజ్ ముఖ్య అతిథిగా హాజరై ప్రారంభించారు. ఈ సందర్భంగా ప్రకాష్ రాజ్ ప్రసంగించిన తీరు దేశంలోని సామాజిక, ఆర్థిక, రాజకీయ అంశాలపై అనేక కోణాలను ఆవిష్కరించింది. సభికులను ఆలోచింపజేసి ఉత్తేజితుల్ని చేసింది. శ్రామిక్ ఉత్సవ్ ఆరంభమైన ఎగ్జిబిషన్ గ్రౌండ్ ప్రాంగణమంతా పుస్తక ప్రదర్శనలు, సైన్స్ ఎగ్జిబిషన్‌లు, వివిధ రకాల స్టాల్స్, సాహిత్య వేదికలతో అక్కడ 'పండగ' వాతావరణం అలముకుంది. చిన్నా, పెద్దలతో కలసి ప్రజలంతా సాయంత్రం 4గంటల నుంచి అక్కడ సందడి చేశారు. విశాల విశాఖ జన సందోహంతో ఉప్పొంగింది.


సిఐటియు రాష్ట్ర ఉపాధ్యక్షులు ఎం.ఎ.గపూర్ అధ్యక్షతన 'సాంస్కృతిక ఉత్సవాల ప్రారంభోత్సవ సూచికగా సినీ నటులు ప్రకాష్ రాజ్ 'నగారా' మోగించారు. శ్రామిక వర్గ సంస్కృతిని పెంపొందించేందుకు ఈ 'శ్రామిక్ ఉత్సవ్' యుద్ధభేరి మోగించినట్టేనని కొనియాడారు. విశాఖ స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు రంగం సిద్ధం చేశాయని, కొనుక్కునేవాడికి అన్నీ అమర్చేదానికోసమే ప్యాకేజీని కేంద్రం ఇచ్చి అప్పుకు జమ చేసిందని గపూర్ తెలిపారు.



ఆకట్టుకున్న చిన్నారుల నృత్యాలు

సభకు ముఖ్య అతిథిగా హాజరైన ప్రకాష్‌రాజ్ మాట్లాడుతూ 'దేశంలో మనువాదాన్ని అమలు చేసేందుకు 'ప్రభు'వే (మోడీని ఉద్దేశించి) రూ.కోట్లు ఖర్చు పెట్టి ప్రచారం చేయడం చూస్తే ఒకప్పుడు పాలకులు తమ మాటలు వినే దొంగలను, ముఠాలను పెంచి పోషించేవారని, నేడు కార్పొరేట్లను పాలకులు పోషిస్తున్నారని, అయితే ఇప్పుడు వారి మాట పాలకులే వినాల్సి వస్తుందని, అందుకు తాజా ఉదాహరణ 'ఇండిగో' విమానాల వైఫల్యం దేశాన్ని కుదిపేసిన సంగతి అందరూ చూశారు కదా?' అని అనడంతో ఒక్కసారిగా సభలో చప్పట్లు మార్మోగాయి.

తానెప్పుడూ మౌనంగా ఉండనని బావితరాలు తప్పు చేసేవాడినైనా క్షమిస్తాయి గానీ ప్రమాదకర పరిణామాలు జరుగుతుంటే మౌనంగా ఉండేవాడిని మాత్రం తరాలు క్షమించవన్నారు. నేను సినీ నటుడినైనా సాంస్కృతికంగా పోరాటం సాగిస్తానన్నారు. పోరాడుతున్న వారికి ప్రజలంతా మద్దతుగా నిలవాలని ఆయన ఆకాంక్షించారు.



పుస్తక ప్రదర్శనను తిలకిస్తున్న యువత

శిథిలావస్థలో పాఠశాల భవనం

- ఊడిపడుతున్న శ్లాబ్ పెచ్చులు
- మూలకు చేరిన టాయిలెట్స్
- తాగునీటి సౌకర్యమూ కరువే..



పెచ్చులూడుతున్న శ్లాబ్



వరండాలో చదువుతున్న విద్యార్థులు

ప్రజాశక్తి -సీలేరు: జీకే వీధి మండలం గుమ్మిరేవుల పంచాయతీ చోడురాయి ఎంపిపి స్కూల్ భవనం, టాయిలెట్స్ శిథిలావస్థకు చేరుకోవడంతో విద్యార్థులకు ప్రమాదం పొంచి ఉంది. పాఠశాల భవనం ఏ క్షణంలో కూలిపోతుందో తెలియని పరిస్థితి నెలకొందని విద్యార్థుల తల్లిదండ్రులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు మౌలిక వసతులు తప్పనిసరిగా ఉండాలని రివ్యూ సమావేశాలు నిర్వహిస్తూ ఆదేశాలు జారీ చేస్తున్నారు. అయితే ఇక్కడ ముఖ్యమంత్రి ఆదేశాలు ఆచరణలో కానరావడం లేదు. చోడిరాయి ఎంపిపి పాఠశాల భవనం లోపల భాగం పూర్తి స్థాయిలో శిథిలావస్థకు చేరుకుంది. వర్షాకాలంలో పాఠశాల భవనం లోపల కారిపోతుండడంతో విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారు. ఎప్పుడు కూలిపోతుందో తెలియక ఆందోళన చెందుతున్నారు. వరండాలో తరగతులు నిర్వహిస్తున్నారు. విద్యార్థులు తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు పాఠశాలలో నెలకొన్న సమస్యలపై అధికారుల దృష్టికి ఎన్నిసార్లు తీసుకెళ్లినా పట్టించుకోవడం లేదు. నూతన పాఠశాల భవనం, టాయిలెట్స్ ఏర్పాటుకు అధికారులు ఎటువంటి చర్యలు చేపట్టుకపోవడంతో పలువురు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఆదివాసీ విద్యార్థుల బాగోగులు అధికారులకు పట్టవా అని ప్రశ్నిస్తున్నారు. గ్రావిటీ పైప్‌లైన్ ద్వారా పాఠశాలకు మంచినీటి కుళాయి ఏర్పాటు చేశారు. అయితే కుళాయి నుంచి వచ్చే నీరు అరకొరగా రావడమే కాకుండా ఒక్కోసారి కలుషిత నీరు కూడా వస్తోందని విద్యార్థులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ధారకొండ స్కూల్ కాంప్లెక్స్ పరిధి పాఠశాలల విద్యార్థులు బాగోగులపై జికె వీధి ఎంఇఒ -1 సత్యనారా యణ, ఎంఇఒ- 2 మాడి రామన్న దృష్టి సారించక పోవడం దురదృష్టకరమని తల్లిదండ్రులు విచారం వ్యక్తం చేశారు. సమస్యలను ఎప్పటికప్పుడు ఉన్నతాధికారులకు నివేదిక రూపంలో అందజేస్తే సమస్యల పరిష్కారానికి మార్గం సుగమం అవుతుందన్నారు. ఇరువురు ఎంఇఒలు సమస్యలపై ప్రత్యేక దృష్టి సారించకపోవడంతో ఎక్కడ వేసిన గొంగళి అక్కడే అన్న చందంగా తయారైందని విచారం వ్యక్తం చేశారు. కలెక్టర్ దినేష్‌కుమార్ స్పందించి పాఠశాలలో సమస్యలు పరిష్కరించాలని కోరారు. పాఠశాలకు తాగునీటి సౌకర్యం పూర్తి స్థాయిలో కల్పించి విద్యార్థులకు ఎటువంటి ప్రమాదాలు జరగకుండా చూడాల్సిన బాధ్యత ఉందని విద్యార్థులు తల్లిదండ్రులు కోరుతున్నారు.



మూలకు చేరిన గ్రావిటీ కుళాయి

పాఠశాలకు నూతన భవనాలు నిర్మించాలి

చోడీరాయి ఎంపిపి పాఠశాలకు నూతన భవనాలు నిర్మించాలి. భవనం కూలిపోయే స్థితికి చేరింది. విద్యార్థులు, ఉపాధ్యాయులు బిక్కుబిక్కుమంటూ తరగతుల్లో కూర్చుంటున్నారు. ప్రభుత్వం స్పందించి నూతన భవనం నిరించేందుకు చర్యలు తీసుకోవాలి.

- మురళ కమలమ్మ, గుమ్మిరేవుల సర్పంచ్

ప్రభుత్వ కార్యాలయాల్లో ఆర్అండ్ఆర్ అర్హుల జాబితా


ప్రజాశక్తి- విఆర్‌పురం: మండలంలోని ఆర్అండ్ఆర్ పిడిఎఫ్ అర్హుల జాబితాను గ్రామాల వారీగా సంబంధిత గ్రామ సచివాలయాల్లో తహశీల్దార్ కార్యాలయం, ఎంపిడిఒ కార్యాలయంలో నోటీస్ బోర్డుల్లో ఉంచామని అసిస్టెంట్ కలెక్టర్ శ్రీ సాయిత్ వీఆర్‌పురం తహశీల్దార్ సరస్వతి తెలిపారు. సదరు జాబితాల్లో పేర్లు రాని పిడిఎఫ్‌లకు విచారణ అనంతరం అనుబంధ అర్హుల జాబితాను మళ్లీ ఉంచుతామన్నారు. ఈ విషయంలో ఎవరూ ఆందోళన చెందవద్దని అసిస్టెంట్ కలెక్టర్, శ్రీసాయిత్, తహశీల్దార్ సరస్వతి తెలిపారు. వడ్డిగూడెం పంచాయతీలో వడ్డిగూడెం589, విఅర్‌పురం 1081, ధర్మతాళ్లగూడెం 167, రామవరం పంచాయతీలో రామవరం 115, రామవరం పాడుబీ175, చొప్పల్లి 216, కొప్పల్లి 72, సోములగూడెం 130, శబరిరాయిగూడెం 132, రవివెంకన్నగూడెం 189, రాజుపేట పంచాయతీలో రాజుపేట 22, రాజుపేటకాలనీ 535, చిన్నమట్టపల్లి పంచాయతీలో చింతరేగుపల్లి 330, పత్తిపాక133, గుండుగూడెం 174, కన్నాయిగూడెం 57 కార్యాలయాల్లో నోటీస్ చేయడం జరిగిందన్నారు.



ఎస్ఐని కలసిన సిపిఎం నాయకులు

శాంతిభద్రతల నిర్వహణకు సహకరించాలి

ప్రజాశక్తి -కూనవరం : శాంతిభద్రతల నిర్వహణకు సహకరించాలని ఎస్ఐ రామకృష్ణ అన్నారు. మండలంలో ఎస్ఐగా భాద్యతలు చేపట్టిన బొడ్డు రామకృష్ణను సిపిఎం నాయకులు శనివారం మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఎస్ఐ మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ మండలంలో శాంతిభద్రతలకు విఘాతం కలిగించకుండా సహకరించాలని కోరారు. కార్యక్రమంలో జిల్లా కమిటీ సభ్యులు మేకల నాగేశ్వరావు, పాయం సీతారామయ్య, బాబు బొర్రయ్య, మడకం నాగమణి, బాబు బొర్రయ్య కర్నాటి శ్రీనివాసరావు పాల్గొన్నారు.



కేలండర్ ఆవిష్కరిస్తున్న గిడ్డి ఈశ్వరి తదితరులు

ప్రజాశక్తి కేలండర్ ఆవిష్కరణ

ప్రజాశక్తి -కొయ్యూరు: మండల కేంద్రంలో 2026 ప్రజాశక్తి నూతన క్యాలెండర్‌ను శనివారం ఆర్‌అండ్‌బి గెస్ట్ హౌస్‌లో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా గిడ్డి ఈశ్వరి మాట్లాడుతూ ప్రతి సంవత్సరం జనవరిలో ప్రజాశక్తి పత్రిక క్యాలెండర్ లో ప్రత్యేకత ఉంటుందన్నారు. ప్రతి ఏడాది అందమైన ఫొటోలతో ప్రచురించిన క్యాలెండర్ పాఠకులకు అందిస్తూ ప్రజల అభిమానాన్ని పొందడం అభినందనీయ మన్నారు. మండల టిడిపి నాయకులు మాట్లాడుతూ నీతిగా నిజాయతీగా వార్తలు ప్రచురిస్తూ ప్రభుత్వానికి ప్రజలకు వారధిగా ప్రజాశక్తి పత్రిక సేవలందిస్తోందని కొనియాడారు. కార్యక్రమంలో సిఐ శ్రీనివాసరావు, గోవింద మాస్టారు, రాజేంద్రపాలెం సర్పంచ్ పీతా సింహాచలం టిడిపి నేతలు బషీర్‌ఖాన్, మేడిపోయిన సత్తిబాబు తదితరులు పాల్గొన్నారు.

ఆదివాసీ మహిళను అర్ధరాత్రి నిర్బంధించడం తగదు

ఐద్వా జిల్లా కమిటీ సభ్యురాలు ముర్రం రంగమ్మ



ప్రజాశక్తి -చింతూరు: సారాయి తరలిస్తోందన్న నెపంతో ఆదివాసీ మహిళను అర్ధరాత్రి ఎక్సైజ్ పోలీసులు నిర్బంధించడం తగదని ఐద్వా జిల్లా కమిటీ సభ్యులు, మండల కమిటీ అధ్యక్షురాలు ముర్రం రంగమ్మ శనివారం ఒక ప్రకటనలో తీవ్రంగా ఖండించారు. మహిళా పోలీసులు లేని సమయంలో ఒక ఆదివాసీ మహిళను ఒంటరిగా పోలీస్‌స్టేషన్లో ఉంచి విచారించటం ప్రజాస్వామ్యానికే అవమానకరమని ఇటువంటి చర్యలకు పాల్పడిన వారిపై శాఖాపరమైన చర్యలు తీసుకోవాలని లేనిపక్షంలో జిల్లా ఐద్వా కమిటీ ఆధ్వర్యంలో ఆందోళన కార్యక్రమాలు చేపడతామని ఆమె హెచ్చరిం చారు. చింతూరు డివిజన్ వ్యాప్తంగా నడుస్తున్న బెల్ట్‌షాపులను అరికట్టడంలో మాత్రం ఎక్సైజ్ పోలీసులు చొరవ చూపడం లేదని ఇటువంటి సంఘటనలు పునరావృతం కాకుండా ఉన్నతాధికారులు చర్యలు తీసుకోవాలని ఆమె కోరారు.

పోలవరం నిర్వాసితులకు

ఆర్ఆర్ ప్యాకేజీ పంపిణీ వేగవంతం చేయాలి

-పునరావస కాలనీలలో మౌలిక వసతులను కల్పించాలి
-జిల్లా కలెక్టర్ దినేష్ కుమార్

ప్రజాశక్తి-పాడేరు: పోలవరం ప్రాజెక్టు నిర్వాసితులకు ఆర్ అండ్ ఆర్ ప్యాకేజీ పంపిణీని వేగవంతం చేయాలని జిల్లా కలెక్టర్ ఏఎస్ దినేష్ కుమార్ అధికారులను ఆదేశించారు. శుక్రవారం కలెక్టరేట్ చాంబర్ నుండి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా వర్చువల్‌గా పోలవరం ప్రాజెక్ట్ అధికారులతో ఆర్ అండ్ ఆర్ ప్యాకేజీ పంపిణీ, తీసుకోవలసిన చర్యలపై సమీక్షా సమావేశం నిర్వహించి పలు సూచనలు చేసారు. ఈ కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ, నిర్వాసితులకు ప్యాకేజీ పంపిణీ విషయంలో అధికారులు అలసత్వం వహించ రాదన్నారు. ప్రాజెక్టు నిర్వాసితులను అయోమయానికి గురిచేసే విధంగా ప్రకటనలు చేసే వారిపై చట్ట పరంగా చర్యలు తీసుకుంటామన్నారు. పునరావాస కాలనీలలో మౌలిక వసతులు కల్పించేందుకు వేగవంతం చేయాలన్నారు. ప్యాకేజీ తీసుకున్న లబ్ధిదారుల వివరాలను ఎప్పటికప్పుడు ఆన్లైన్ పోర్టల్‌లో పొందుపరచాలని తెలిపారు. ప్రాజెక్ట్ ఆర్ అండ్ ఆర్ ప్యాకేజీ పంపిణీ సమగ్ర వివరాలను జిల్లా కలెక్టర్ కార్యాలయానికి ఎప్పటికప్పుడు అందించాలన్నారు. ప్యాకేజీ తీసుకోకుండా ఉన్న లబ్ధిదారులు అందుబాటులో లేనియెడల వారికి బంధుమిత్రుల ద్వారా సమాచారం అందించాలని సూచించారు. నిర్వాసితుల పునరావాస కాలనీలకు భూమి అందుబాటులో లేని యెడల భూసేకరణ చేపట్టాలన్నారు. గ్రామ సభలను నిర్వహించి నిర్వాసితుల నుండి ఆర్ అండ్ ఆర్ ప్యాకేజీ పంపిణీకి తీర్మానం చేపట్టాలన్నారు. నిర్వాసిత కాలనీలో గృహాలను త్వరితగతిన పూర్తి చేయాలని జిల్లా గృహ నిర్మాణ శాఖ అధికారులకు ఆదేశించారు. ఈ కార్యక్రమంలో పోలవరం ప్రాజెక్ట్ పరిపాలనాధికారి వి.అభిషేక్, ఐటీడీఏ రంపచోడవరం పివో బి.స్మరణ్‌రాజ్, చింతూరు ఐటిడిఏ ఇంచార్జ్ పిఒ సబ్‌కలెక్టర్ శుభం నొక్వాల్ జిల్లా గృహ నిర్మాణ శాఖ ప్రాజెక్ట్ డైరెక్టర్ బాబు, పోలవరం ప్రాజెక్టు అధికారులు, పోలవరం ప్రాజెక్టు ముప్పు మండలాల రెవెన్యూ అధికారులు తదితరులు పాల్గొన్నారు.



అధికారులతో మాట్లాడుతున్న కలెక్టర్

బంగారు కుటుంబాలను దత్తత తీసుకోవాలి

పాడేరు: జిల్లాలో బంగారు కుటుంబాలను దత్తత తీసుకొని, వారి ఆర్థిక, మౌళిక వసతులు, జీవన పరిస్థితిలను మెరుగు పరచాలని జిల్లా కలెక్టర్ ఏ ఎస్ దినేష్ కుమార్ సూచించారు. శనివారం క్యాంపు ఆఫీస్ నుండి వర్చువల్ గా వీడియో కాన్ఫరెన్స్‌లో జిల్లా అధికారులు, నియోజకవర్గ ప్రత్యేక అధికారులు, మండల ప్రత్యేక అధికారులు, మండలాల ఎంపీడీవోలు, ఎమ్మార్వోలతో పి4 పథకం పై సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సమీక్ష సమావేశంలో ఆయన మాట్లాడుతూ, జిల్లాలో ఎక్కువ బంగారు కుటుం బాలను మార్గదర్శిలతో అనుసంధించాలన్నారు. మార్గదర్శిలు దత్తత తీసుకున్న బంగారు కుటుంబాలకు సంబంధించిన సచివాలయాల పరిధిలో అనుసంధాన సమావేశాన్ని ఏర్పాటు చేయాలన్నారు. ఈ సమావేశాల్లో విజయవంతమైన మార్గదర్శి బంగారు కుటుంబాల అనుసంధాన విజయగాధలను చర్చించాలన్నారు. జిల్లా పరిధిలో ఉన్న ప్రతి సచివాలయం నుండి పి4 పథక విజయగాథలను తయారు చేయాలన్నారు. ప్రజా ప్రతినిధులు, ప్రభుత్వ ఉద్యోగులు, సంస్థలు బంగారు కుటుంబాలను దత్తత తీసుకొనుటలో ముందు ఉండాలన్నారు. గుర్తించిన బంగారు కుటుంబాలకు ఆర్థికపరమైన, ఆర్థికేతరమైనటు వంటి అవసరాలను గుర్తించి ప్రతి సచివాలయం పరిధిలో గ్రామ పరిధిలో విలేజి యాక్షన్ ప్లాన్స్ సిద్ధంచేసి ఉంచాలని సూచించారు.బంగారు కుటుంబాలను దత్తత తీసుకొనుటలో వెనుకబడిన మండలాలు ప్రత్యేక కార్యాచరణ సిద్ధం చేసుకోవాలని తెలిపారు.ఫండ్ అండ్ నీడ్ కార్యక్రమం ద్వారా ప్రభుత్వ పాఠశాలలో చదువుతున్న విద్యార్థులకు నైపుణ్య సామర్థ్యాలు పెంపొందించుటకు, మౌలిక వసతులను కల్పించుటకు, ఆరోగ్యం మెరుగుపరుచుటకు చేపట్టవలసిన కార్యక్రమాలపై ప్రతిపాదనలు తయారు చేసి ఫన్ అండ్ నీట్ పోర్టల్ నందు నమోదు చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో రంపచోడవరం ఐటిడిఏ పిఓ స్మరణ రాజ్, చింతూరు ఐటిడిఏ ఇంచార్జ్ పివో శుభం నోక్వాల్, అసిస్టెంట్ కలెక్టర్ సాహిత్, ఇంచార్జి ఆర్డీవో, పి 4 నోడల్ అధికారి, డిప్యూటీ కలెక్టర్ లోకేశ్వరరావు, డిఆర్డిఏ పిడి వి.మురళీ, రహదారులు భవనాల శాఖ ఈఈ బాలసుందరబాబు, గ్రామ వార్డ్ సచివాలయ నోడల్ ఆఫీసర్ పిఎస్ కుమార్, డిపివో కె.పి.చంద్రశేఖర్, జిల్లా ప్రణాళిక అధికారి పి. ప్రసాద్, పాడేరు ఐటిడిఏ ఏపివో వెంకటేశ్వర్లు మండల ప్రత్యేక అధికారులు, మండల రెవెన్యూ అధికారులు, మండల అభివృద్ధి అధికారులు తదితరులు పాల్గొన్నారు.

ఘాట్ రోడ్డులో స్తంభించిన వాహనాలు

ప్రజాశక్తి అనంతగిరి :అనంతగిరి-అరకు ఘాట్ రోడ్డులో వాహనాల రద్దీ నెలకొంది. క్రిస్టమస్ సెలవులతో ప్రముఖ పర్యాటక కేంద్రాలను తిలకించేందుకు పలు ప్రాంతాలకు చెందిన వేల మంది పర్యాటకులు తరలిరావడంతో ఘాట్ రోడ్డు కిటకిటలాడాయి.వాహనాలు ఇరుకు రోడ్డుపై గంటల తరబడి ట్రాఫిక్ అంతరాయం నెలకొంది. అరకు ఏరియా ఆసుపత్రి నుండి విశాఖకు ఓ రోగినితరలిస్తున్న 108 అంబులెన్స్ సుంకరమెట్ట ప్రాంతంలో ట్రాఫిక్‌లో చిక్కుకుంది. సైరన్ మోగించినప్పటికీ ముందుకు వెళ్లేందుకు దారి లేక అంబులెన్స్ నిలిచిపోయింది. సుంకరమెట్ట కాఫీ ప్లాంటేషన్, వుడెన్ పార్క్, యు పాయింట్, బొర్రా గుహలు, తాడిగుడ, డముకు యు పాయింట్లులో పర్యాటకులు పోటెత్తారు. వాహనాలు నిలిచి పోవడంతో రాకపోకలు సాగించే వాహనచోధకులు ఇబ్బందులు పడ్డారు.



షెడ్యూల్డ్ ప్రాంత ఉద్యోగ నియామక చట్టం చేయాలి

ఆంధ్రప్రదేశ్ ఆదివాసీ జెఎసీ జిల్లా చైర్మన్ రామారావుదొర

ప్రజాశక్తి-మారేడుమిల్లి: షెడ్యూల్డ్ ప్రాంత ఉద్యోగ నియామకాల చట్టం చేయాలని రంపచోడవరం కేంద్రంగా ప్రకటించిన పోలవరం జిల్లాలో పోలవరం ప్రాంతాన్ని కలపాలని ఆంధ్రప్రదేశ్ ఆదివాసీ జెఎసి జిల్లా చైర్మన్ రామారావుదొర డిమాండ్ చేశారు. ముఖ్యమంత్రి ఆదివాసులకు ఇచ్చిన మాట ప్రకారం షెడ్యూల్డ్ ప్రాంత ఉద్యోగ నియామకాల చట్టం చేయాలని కోరుతూ నవంబర్ 9, 2025 నుండి రాష్ట్రవ్యాప్తంగా షెడ్యూల్డ్ ప్రాంతాల్లో కొనసాగుతున్న ఆదివాసీ సత్యాగ్రయాత్రలో భాగంగా శనివారం రంపచోడవరం సబ్‌కలెక్టర్‌ను ఐటిడిఎ వద్ద కలిసి వినతిపత్రం అందజేశారు. ఆదివాసులకు ముఖ్యమంత్రి చంద్రబాబు ఏజెన్సీ ప్రాంత ప్రభుత్వ ఉద్యోగాల్లో స్థానిక ఆదివాసులకు రిజర్వేషన్లు కల్పిస్తామని, పోలవరం ప్రాంతాన్ని ప్రత్యేక జిల్లా ఇస్తామని హామీ ఇచ్చారని గుర్తు చేశారు. ఇచ్చిన హామీ ప్రకారం ఉద్యోగ నియామకాల చట్టం వెంటనే చెయ్యకపోతే రానున్న డీఎస్సీలో కూడా ఆదివాసీలు ఉద్యోగాలు కోల్పోవాల్సి వస్తుందని ఆవేదన వ్యక్తం చేశారు. కెఆర్‌పురం ఐటిడిఎ పరిధిలోని షెడ్యూల్ ప్రాంతాన్ని రంపచోడవరం కేంద్రంగా ప్రకటించిన పోలవరం జిల్లాలో కలిపి షెడ్యూల్ ప్రాంత పరిధిలోకి తీసుకు రావాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో ఆంధ్రప్రదేశ్ ఆదివాసీ జెఎసి కోర్ కమిటీ సభ్యులు మట్ల కృష్ణారెడ్డి, రాష్ట్ర ప్రచార కార్యదర్శి పోడియం శ్రీనుబాబు, పీసా గ్రామసభ ఉపాధ్యక్షులు సారపు రాజన్న దొర, వెలుగూరి చెన్నారెడ్డి, బిల్ల లింగారావు పాల్గొన్నారు.



సబ్ కలెక్టర్‌కి వినతిపత్రం ఇస్తున్న ఆదివాసీ నాయకులు

ముమ్మరంగా వాహన తనిఖీలు

ప్రజాశక్తి- మారేడుమిల్లి: మండల కేంద్రమైన మారేడుమిల్లిలో శనవారం వాహనాలను తనిఖీ చేశారు. తెలంగాణ, చత్తీస్‌గఢ్, ఒడిశా నుండి వస్తున్న వాహనాల రికార్డులను క్షుణ్ణంగా పరిశీలించడం జరిగింది. సరైన రికార్డులు లేని వాహనాలకు జరిమానాలు విధించడం జరిగింది. ఘాట్‌రోడ్‌లో ప్రయాణించే ప్రతి వాహనం ఫిట్‌నెస్ కలిగి ఉండాలని, ఘాట్‌రోడ్డుపై సీనియర్ డ్రైవర్లు మాత్రమే వాహనాలు నడపాలని, వారికి హెవీలైసెన్స్ కలిగి ఉండాలన్నారు.

అలాగే రాత్రి పది గంటల నుండి ఉదయం 6 గంటల వరకు మారేడుమిల్లి చింతూరు ఘాట్‌రోడ్డును జిల్లా ఉన్నతాధికారుల ఆదేశాలు మేరకు మూసివేయడం జరిగింది. మారేడుమిల్లి లో చేపట్టిన వాహన తనిఖీల్లో సుమారు రూ.1.42 వేలు జరిమానాలు విధించడం జరిగిందన్నారు.


ఉపకరణాలు ఇస్తున్న కలెక్టర్ దినేష్‌కుమార్

విభిన్న ప్రతిభావంతులకు ఉపకరణాలు అందజేత

ప్రజాశక్తి - పాడేరు: విభిన్న ప్రతిభావంతులకు సమాజంలో సమున్నత స్థానం కల్పించాలని జిల్లా కలెక్టర్ జిల్లా కలెక్టర్ ఎస్ దినేష్ కుమార్ తెలిపారు. శనివారం జిల్లా కలెక్టరేట్ ప్రాంగణంలో ఎబిలిటీ రిహాబిలిటేషన్ సెంటర్ (విశాఖపట్నం) పాడేరు మండలం కె.కుమ్మర పుట్టు గ్రామానికి చెందిన బి సన్యాసమ్మ, శాంతికుకు వీల్ ఛైర్, కె.విజయ కుమారికి కృత్రిమ పాదం వంటి ఉపకరణాలు పంపిణీ చేశారు. కుమ్మరి పుట్టు గ్రామానికి చెందిన వినీత తొందరగా కోలుకోవడానికి జిల్లా కేంద్రం ద్వారా పౌష్టికాహారం, ఫిజియోథెరపీ అందించా లన్నారు. ఈ కలెక్టర్ మాట్లాడుతూ, శారీరక అంగవైకల్యంతో బాధపడుతున్న వారికి కృత్రిమ ఉపకరణాలు, పౌష్టికాహార లోపంతో శారీరక ఎదుగుదల లోపంతో బాధపడుతున్న పిల్లలకు మన పాడేరు జిల్లా కేంద్ర ఆసుపత్రి ప్రాంగణంలో రీ హెబిలిటేషన్ సెంటర్ ను ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. తద్వారా శారీరక, మానసిక ఎదుగుదల లోపంతో బాధపడుతున్న చిన్నారులకు ఫిజియోథెరపీ, న్యూట్రిషన్ అందించడం జరుగుతుందన్నారు. విభిన్న ప్రతిభావంతులకు కృత్రిమ ఉపకరణాలు అందించడం జరుగుతుందన్నారు. ఈ సేవలను వినియోగించు కోవాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎబిలిటీ రిహాబిలిటేషన్ సెంటర్ డైరెక్టర్ దిలీప్ పాత్రుడు, కౌన్సిలర్ స్వప్న తదితరులు పాల్గొన్నారు.

31న పింఛన్ల పంపిణీ

ప్రజాశక్తి-పాడేరు: రాష్ట్రప్రభుత్వం పింఛనుదారులకు నూతన సంవత్సర కానుకను ప్రకటించింది. ఈ నెల 31నే ఎన్టీఆర్ భరోసా పింఛన్ల పంపిణీ చేయనున్నట్టు జిల్లా కలెక్టర్ ఏఎస్ దినేష్ కుమార్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆ రోజు ఉదయం 7 గంటల నుంచి గ్రామ, వార్డు సచివాలయ సిబ్బంది లబ్ధిదారుల ఇళ్లకు వచ్చి పింఛన్లను అందజేస్తారని తెలిపారు. డిసెంబర్ నెలకు గాను నగదు 30న బ్యాంకు ఖాతాల్లో జమ చేయడం జరుగుతుందని, సంబంధిత సచివాలయ సిబ్బంది నగదు విత్ డ్రా చేసుకొని పింఛన్ల పంపిణీకి సిద్ధంగా ఉండాలని ఆదేశించారు.

సంతలో కోళ్లకు గిరాకీ

ప్రజాశక్తి -హుకుంపేట:హుకుంపేటలో శనివారం నిర్వహించిన వారపు సంతలో సంక్రాంతి నేపథ్యంలో కోళ్లకు మంచి గిరాకీ ఏర్పడింది. పండుగ సమీపిస్తుండటంతో సంతకు వచ్చిన ప్రజలు కోళ్ల కొనుగోలుపై ఆసక్తి చూపారు. కేజీ నుంచి రెండు కేజీల వరకు బరువున్న కోడి రూ.800 నుంచి రూ.1000 వరకు ధర పలికింది.రానున్న రోజుల్లో కూడా కోళ్లకు డిమాండ్ మరింత పెరిగే అవకాశం ఉందని వ్యాపారులు తెలిపారు.


సంతకు తీసుకొచ్చిన కోళ్లు

అరకులోయలో వణికిస్తున్న చలి

-తొమ్మిది గంటల వరకూ వీడని పొగమంచు
-ఇబ్బంది పడుతున్న గిరిజనులు, పర్యాటకులు

ప్రజాశక్తి-అరకులోయ రూరల్:అల్లూరి సీతారామ రాజు జిల్లా అరకులోయ మండల కేంద్రంతో పాటు పరిసర ఏజెన్సీ ప్రాంతాలను ఎముకలు కొరికే చలి వణికిస్తోంది. గత కొన్ని రోజులుగా ఉష్ణోగ్రతలు గణనీయంగా పడిపోవడంతో ఉదయం 9 గంటల వరకు దట్టమైన పొగమంచు కమ్మేస్తోంది. ఇంటి నుంచి బయటకు రావాలంటేనే ప్రజలు భయపడే పరిస్థితి నెలకొంది. చలి తీవ్రత అధికంగా ఉండటంతో అరకులోయ మండల కేంద్రంలోని కాలనీలు, గిరిజన గ్రామాల్లో ప్రజలు తెల్లవారు జామునే అగ్ని మంటలు వేసుకుని చలిని తట్టుకుంటున్నారు. ముఖ్యంగా వృద్ధులు, చిన్నారులు చలితో వణుకుతూ తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. సరైన రక్షణ చర్యలు లేక పోవడంతో అనారోగ్య సమస్యలు తలెత్తుతున్నాయని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. దట్టమైన పొగమంచు కారణంగా అరకులోయ-పాడేరు రహదారిపై వాహనాల రాకపోకలు మందగించాయి. ఉదయం వేళల్లో దూరం స్పష్టంగా కనిపించక పోవడంతో ప్రయాణికులు, వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. పాఠశాలలు, కార్యాలయాలకు వెళ్లే వారు ఆలస్యంగా చేరాల్సిన పరిస్థితి నెలకొంది. మాడగడ మేఘాలు, దట్టమైన పొగమంచుతో అరకులోయ ప్రాంతం పాల సముద్రంలా కనిపిస్తూ పర్యాటకులను ఆకర్షిస్తోంది.ఈ సహజ అందాలను తిలకించేందుకు పర్యాటకులు పెద్ద సంఖ్యలో తరలివస్తున్నారు. తీవ్రమైన చలిని తట్టుకోలేక కొందరు పర్యాటకులు కూడా ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. వాతావరణం మరికొన్ని రోజులు ఇలాగే కొనసాగనున్నట్లు అంచనా వేస్తున్నారు. ప్రజలు, గిరిజనులు, పర్యాటకులు తగిన జాగ్రత్తలు తీసుకోవాలని అధికారులు సూచిస్తున్నారు.


మంటను కాగుతున్న గిరిజనులు

మౌలిక సౌకర్యాల కల్పనకు కృషి

ఆర్‌టిసి విజయనగరం రీజినల్ ఛైర్మన్ దొన్నుదొర


పర్యటిస్తున్న దొన్నుదొర

ప్రజాశక్తి -హుకుంపేట:గిరిజన గ్రామాల్లో మౌలిక సౌకర్యాల కల్పనకు ప్రభుత్వం కృషి చేస్తోందని ఆర్‌టిసి విజయనగరం రీజినల్ ఛైర్మన్ దొన్నుదొర తెలిపారు. మండలంలోని పాతకోట పంచాయతీ పాలెం నుండి పెద్ద చెట్టు గ్రామం వరకు బిట్ రోడ్డు నిర్మాణానికి ఆయన శనివారం శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా దొన్నుదొర మాట్లాడుతూ, కూటమి ప్రభుత్వం గ్రామాల అభివృద్ధికి కృషి చేస్తుందన్నారు. గతంలో రోడ్డు సౌకర్యం లేక గిరిజనులు అనేక ఇబ్బందులు ఎదుర్కొన్నారని, వాటికి నేడు ప్రభుత్వం పరిష్కారం చూపుతోందని చెప్పారు. రాబోయే రోజుల్లో అన్ని గ్రామాలకు రోడ్లు, తాగునీరు, విద్య, వైద్యం, సంక్షేమ పథకాలు అందించడమే కూటమి ప్రభుత్వ లక్ష్యమని పేర్కొన్నారు. గిరిజన ప్రజల తరపున ప్రభుత్వానికి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో మాజీ జీసీసీ ఛైర్మన్ శెట్టి లక్ష్మణుడు, జనసేన అరకు నియోజకవర్గ ఇంచార్జ్ శెట్టి చిరంజీవి, అరకు నియోజకవర్గ మహిళా అధ్యక్షురాలు సూర్యకాంతం, ఉపాధ్యక్షురాలు సాగర సత్యవతి, హుకుంపేట మండల అధ్యక్షుడు శతక బొంజుబాబు, మాజీ మండల అధ్యక్షుడు కొర్ర తులసీరావు, సర్పంచ్‌లు బాకూరు వెంకటరమణ, సత్యనారాయణ పాల్గొన్నారు.

టెన్త్‌లో శతశాతం ఉత్తీర్ణత సాధించాలి

ప్రజాశక్తి -పాడేరు: ప్రభుత్వ పాఠశాలలు, గిరిజన సంక్షేమ, గురుకుల పాఠశాలలు 10వ తరగతి పబ్లిక్ పరీక్షల్లో శత శాతం ఉత్తీర్ణత సాధించాలని జిల్లా కలెక్టర్ దినేష్‌కుమార్ సంబంధిత అధికారులకు ఆదేశించారు. శనివారం కలెక్టర్ చాంబర్ నుండి జిల్లా విద్యాశాఖ అధికారులతో వర్చువల్ గా వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సమావేశంలో ఆయన మాట్లాడుతూ, జిల్లాలో 10వ తరగతి చదువుతున్న విద్యార్థినీ విద్యార్థులు శత శాతం ఉత్తీర్ణత సాధించుటకు 100 రోజుల యాక్షన్ ప్లాన్ తయారు చేయాలన్నారు. ఈ కార్యక్రమాన్ని ఐటీడీఏ అసిస్టెంట్ ప్రాజెక్ట్ ఆఫీసర్లు నిరంతరం పర్యవేక్షణ చేయాలన్నారు. విద్యార్థులు చదువులో మెరుగ్గా రాణించుటకు పోటీ పరీక్షలను నిరంతరం నిర్వహించాలన్నారు. చదువులో వెనుకబడిన, పోటీ పరీక్షలకు హాజరు కాని విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ వహించి పరీక్షలు నిర్వహించాలని తెలిపారు. యాక్షన్ ప్లాన్ అమలు చేయడంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు, మండల విద్యాశాఖ అధికారులు ముఖ్యపాత్ర వహించాలన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా విద్యాశాఖ అధికారి కె.కృష్ణారావు, గిరిజన సంక్షేమ శాఖ డిప్యూటీ డైరెక్టర్ పీబికె పరిమళ, మండల విద్యాశాఖ అధికారులు అసిస్టెంట్ ట్రైబల్ వెల్ఫేర్ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

నేరాలు ఘోరాలు

అనుమానాస్పద స్థితిలో మహిళ మృతి

ప్రజాశక్తి -అరకులోయ రూరల్:అరకులోయలో మహిళ అనుమానాస్పద స్థితిలో మృతి చెందడం కలకలం రేపింది. అరకులోయ టౌన్‌షిప్‌లోని రెవిన్యూ క్వార్టర్స్ సమీపంలో రత్నాలమ్మ (60) శుక్రవారం రాత్రి అనుమానాస్పద పరిస్థితుల్లో మృతి చెందినట్లు స్థానికులు తెలిపారు. విషయం తెలుసుకున్న కుటుంబ సభ్యులు, స్థానికులు పోలీసులకు సమాచారం అందించారు.అరకులోయ పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని పరిశీలించారు. అనంతరం పోస్టుమార్టం నిమిత్తం మృతదేహానికి ఆస్పత్రికి తరలించారు.

ట్యాంకర్ లారీలో మంటలు

ప్రజాశక్తి - ఆనందపురం : ఆనందపురం పోలీస్ స్టేషన్ పరిధిలో బోయపాలెం జాతీయ రహదారి సిగ్నల్ వద్ద శనివారం సాయంత్రం 4 గంటల సమయంలో భారీ ప్రమాదం తప్పింది. మధురవాడ నుంచి ఆనందపురం వైపు వెళు న్న ఓ ట్యాంకర్ లారీ ఇంజిన్‌లో షార్ట్ సర్క్యూట్‌తో ఒక్కసారిగా మంటలు చెలరేగాయి. సమాచారం అందుకున్న ఫైర్ సిబ్బంది వెంటనే ఘటనా స్థలానికి చేరుకుని మంటలను అదుపుచేశారు. ఎటువంటి ప్రాణ నష్టం జరగకపోవడంతో స్థానికులు, వాహనదారులు ఊపిరి పీల్చుకున్నారు.

అగ్ని ప్రమాదంలో లారీ దగ్ధం

ప్రజాశక్తి- అనకాపల్లి రూరల్ : అనకాపల్లి జాతీయ రహదారిపై శుక్రవారం అగ్ని ప్రమాదం చోటుచేసుకుంది. దీంతో కిలో మీటర్ల పొడవునా వాహనాలు నిలిచిపోయాయి. కోయంబత్తూరు నుంచి చెన్నై పేపర్ల వ్యర్థాలతో వెళ్తున్న లారీ క్యాబిన్ నుంచి మంటలు చెలరేగి మొత్తం తగలపడింది. డ్రైవర్ అప్రమత్తం ఆవడముతో ఎలాంటి ప్రాణ నష్టం జరగలేదు. పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని ట్రాఫిక్‌ను పునరుద్ధరించారు

లారీ ఢీకొని వ్యక్తికి తీవ్ర గాయాలు

ప్రజాశక్తి -గాజువాక : హిందూజా పవర్ ప్లాంట్ బొగ్గు లారీ ఢీకొని దేవాడ గ్రామానికి చెందిన నాగూర్ మీరా (33) తీవ్ర గాయాలపాలయ్యారు. శనివారం ఉదయం జరిగిన ఘటనకు సంబంధించిన వివరాలు ఇలా ఉన్నాయి.. దేవాడకు చెందిన నాగూర్ మీరా శనివారం రోడ్డు దాటుతుండగా బొగ్గు లారీ ఢీకొట్టింది. నాగూరు మీరా కాలుపైనుంచి ముందు చక్రం వెళ్లిపోవడంతో కాలు మొత్తం నుజ్జయింది. చికిత్స నిమిత్తం అతన్ని కెజిహెచ్‌కు తరలించారు.

విద్యుత్ శాఖలో కారుణ్య నియామకాలు


నియామకపత్రాలు అందిస్తున్న మంత్రి రవికుమార్

ప్రజాశక్తి-మధురవాడ : విశాఖపట్నం సాగర్‌నగర్‌లోని ఎపిఇపిడిసిఎల్ సిఒఇటి భవనంలో విద్యుత్ శాఖలోని అర్హులైన 34 మందికి కారుణ్య నియామక పత్రాలను ఇంధన శాఖా మంత్రి గొట్టిపాటి రవికుమార్ శనివారం అందజేశారు. ఈ సందర్భంగా మంత్రి గొట్టిపాటి రవికుమార్ మాట్లాడుతూ, విధి నిర్వహణలో ప్రాణాలు కోల్పోయిన ఉద్యోగుల కుటుంబాలకు కూటమి ప్రభుత్వం అండగా నిలుస్తుందన్నారు గత 18 నెలల కాలంలో 287 మంది అర్హులైన అభ్యర్థులకు కారుణ్య నియామకాలు కల్పించడం ద్వారా ఆయా కుటుంబాలకు భరోసా ఇచ్చినట్లు పేర్కొన్నారు. సౌర శక్తిని ప్రోత్సహిస్తూ గతంలో విద్యుత్ లేని గ్రామాలు, గిరిజన ఆవాసాలకు వెలుగులు నింపుతున్నామని మంత్రి తెలిపారు. వ్యవసాయ రంగానికి అత్యంత ప్రాధాన్యత ఇస్తున్నామని, వ్యవసాయ విద్యుత్ కనెక్షన్ల మంజూరులో ఎలాంటి ఆలస్యం జరగకుండా అధికారులు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. విద్యుత్ శాఖలో మానవ తప్పిదాల వల్ల జరిగే ప్రమాదాలను నివారించేందుకు కఠిన చర్యలు తీసుకోవాలని మంత్రి ఆదేశించారు. ఈ సందర్భంగా ఎపిఇపిడిసిఎల్ అధికారులు అభివృద్ధి చేసిన కొత్త యాప్ గురించి సిఎండి పృథ్వీతేజ్ ఇమ్మడి మంత్రికి వివరించారు. ఈ కార్యక్రమంలో శ్రీనివాసరావు, పి.విష్ణుకుమార్‌రాజు, సంస్థ డైరెక్టర్లు టివి.సూర్యప్రకాష్, ఎస్.హరిబాబు తదితరులు పాల్గొన్నారు.


పగలు హెడ్‌లైట్లు వేసుకుని వెళ్తున్న వాహనదారులు

ఉష్ణోగ్రతలు తగ్గుముఖం

ప్రజాశక్తి -సీలేరు: రోజురోజుకీ మంచు, చలి పెరుగుతుండడంతో ప్రజలు భయాందోళన చెందుతున్నారు. జీకే వీధి మండలం సీలేరులో చలి, మంచు రోజురోజుకీ పెరిగిపోతూ వాతావరణంలో పూర్తిగా మార్పులు చోటు చేసుకుంటు న్నాయి. ఉదయం 8 గంటల వరకు మంచు, చలి తీవ్రత తగ్గకపోవ డంతో ప్రజలు రోడ్లపైకి వచ్చేందుకు సాహసించడం లేదు. గత ఏడాదితో పోల్చుకుంటే చలి గణనీయంగా పెరిగింది. శనివారం ఉదయం నుంచి సాయంత్రం వరకు చల్లటి చిరుగాలులు వీస్తూ అధికశాతం మంచు కురవడంతో మార్కెట్ సెంటర్‌లో దుకాణాలు తెరుచుకోలేదు. పగలే లైట్లు వేసుకుని వాహనాలు నడపవలసిన పరిస్థితి ఏర్పడింది. సీలేరు నదీ పరీవాహక ప్రాంతంలో ఉన్న గిరిజనులు సైతం చలి తీవ్రతకు తట్టుకోలేక అవస్థలు పడుతున్నారు. ఇదే పరిస్థితి కొనసాగితే వృద్ధులు మృత్యువాత పడే ప్రమాదం ఉంది.



వార్మ్‌బ్యాగ్‌లు అందిస్తున్న సమారిటన్స్ సంస్థ సభ్యులు

ప్రభుత్వ ఆసుపత్రికి 500 వార్మ్‌బ్యాగులు అందజేత

ప్రజాశక్తి -చింతూరు : చింతూరు డివిజన్ పరిధిలోని పిహెచ్‌సి, సిహెచ్‌ఎస్ ఐసిడిఎస్ కేంద్రాల్లో 500 వార్మ్ బ్యాగ్‌లు సమారిటన్స్ ఫర్ ద నేషన్ స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో పంపిణీ చేశారు. హ్యుందాయ్ మోటార్ ఇండియా ఇంజినీరింగ్ ప్రైవేట్ లిమిటెడ్ వారి సిఎస్ఆర్ కార్యక్రమంలో భాగంగా నిర్వహించబడింది. లక్ష రూపాయల వ్యయంతో ఈ ప్రాజెక్టును సమారిటన్స్ ఫర్ ద నేషన్ స్వచ్ఛంద సంస్థ అమలు చేసింది. ఈ సందర్భంగా చింతూరు సిహెచ్‌సి సూపరింటెండెంట్ డాక్టర్ కోటిరెడ్డి మాట్లాడుతూ, చలికాలంలో గర్భిణులు, ప్రసూతి అనంతరం తల్లులు చిన్నారులకు ఈ వార్మ్‌బ్యాగ్‌లు ఎంతో ఉపయోగ కరంగా ఉంటాయని తెలిపారు. ఇలాంటి సిఎస్ఆర్ కార్యక్రమాలు ప్రభుత్వ ఆరోగ్య సేవలకు బలాన్ని చేకూరుస్తాయని, హ్యుందాయ్ సంస్థ, సమారిటన్స్ ఫర్ ద నేషన్‌కు కృతజ్ఞతలు తెలిపారు.

94 మంది పోలీసులకు రివార్డులు

ప్రజాశక్తి-ఎంవిపి కాలనీ : విశాఖ నగర పోలీసు శాఖలో విధి నిర్వహణలో అత్యుత్తమ ప్రతిభ కనబరిచిన అధికారులకు, సిబ్బందికి నగర పోలీసు కమీషనర్ డాక్టర్ శంఖబ్రత బాగ్చి రివార్డులను అందజేశారు. శనివారం నిర్వహించిన 'యాన్యువల్ క్రైమ్ రివ్యూ మీటింగ్' సందర్భంగా హోంగార్డు స్థాయి నుండి సిఐ స్థాయి వరకు మొత్తం 94 మందికి ఆయన ప్రశంసా పత్రాలు, రివార్డు మంజూరు ఉత్తర్వులను అందజేశారు. ఈ సందర్భంగా సీపీ మాట్లాడుతూ, గంజాయి అక్రమ రవాణా అడ్డుకుని, నిందితులను పట్టుకున్నవారు, చోరీకి గురైన సొత్తును, ఇతర విలువైన వస్తువులను వేగంగా స్వాధీనం చేసుకున్న సిబ్బంది, టెక్నాలజీని ఉపయోగించి పేరుమోసిన నేరస్తులను అరెస్టు చేయడంలో కీలకపాత్ర పోషించిన వారు, సైబర్ కేసులను ఛేదించిన సిబ్బంది ఉన్నారని తెలిపారు.

ఉపాధిహామీ చట్టానికి కేంద్రం తూట్లు

సిపిఎం రంపచోడవరం జిల్లా కార్యదర్శివర్గసభ్యులు మర్లపాటి నాగేశ్వరరావు

ప్రజాశక్తి- ఎటపాక: మహాత్మాగాంధీ జాతీయ ఉపాధిహామీ చట్టం పేరు మార్చడమే కాదు దాని స్వభావాన్ని దెబ్బతీస్తూ గ్రామీణ ఉపాధికి, గ్రామీణ అభివృద్ధికి కేంద్రం తూట్లు పొడుస్తోందని సిపిఎం రంపచోడవరం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు మర్లపాటి నాగేశ్వరరావు అన్నారు. శనివారం తుమ్మలనగర్‌లో సోందే రామారావు అధ్యక్షతన సిపిఎం మండల కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా నాగేశ్వరావు మాట్లాడుతూ వామపక్షాల కృషితో 2005లో కాంగ్రెస్ ప్రభుత్వం ఉపాధి హామీ పథకాన్ని తీసుకొచ్చిందని, గ్రామాల్లో వందరోజుల పాటు కచ్చితంగా ఉపాధిని కల్పిస్తుం దన్నారు. కేంద్రంలో బిజెపి అధికారంలోకి వచ్చినప్పటి నుంచి ఉపాధి హామీ పథకంపై విషం కక్కుతోందని, నేడు ఉపాధి హామీ పథకం ఉసురు తీసింద న్నారు. ఈ పథకానికి కేంద్రం నిధులు కోత పెట్టి రాష్ట్రాలపై భారం వేస్తోంద న్నారు. పర్యవసానంగా గ్రామీణ ప్రాంతాల్లో కోట్లాదిమందికి ఉపాధి తగ్గి, పంచాయతీల అభివృద్ధి కుంటుపడుతోందన్నారు. దీనికి నిరసనగా ఉపాధి హామీ కార్మికులంతా ఏకమై నిరసన చేపట్టాలని పిలుపునిచ్చారు. సిపిఎం ఆధ్వర్యంలో ఆందోళనకు పిలుపునిస్తామని, ఉపాధి హామీ చట్టం తిరిగి యధావిధిగా కొనసాగే వరకూ పోరాటం కొనసాగిస్తామని హెచ్చరించారు. మండల కార్యదర్శి అర్జున్‌దొర, మండల కమిటీ సభ్యులు పులుసు బాలకృష్ణ, పూనెం వెంకటరావు, సవలం రాము, హుస్సేన్, జంగిలి సంపత్ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న మర్లపాటి నాగేశ్వరరావు


రోగులను పరీక్షిస్తున్న వైద్యులు

పలువురికి కంటి పరీక్షలు

ప్రజాశక్తి -కొయ్యూరు: మండలంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రం రాజేంద్రపాలెం పరిధిలో ఎం.మాకవరం పంచాయతీ చింతలపూడి గింజర్తి గ్రామానికి చెందిన రాజేంద్రపాలెం పిహెచ్‌సి వైద్యాధికారి డాక్టర్ జగదీష్‌నాయక్ ఆధ్వర్యంలో తుని, పాయకరావుపేట హైమా నేత్రాలయం వారిచే నేత్రవైద్యశిబిరం ఏర్పాటు చేసినట్లు తెలిపారు. శిబిరంలో సుమారు 110 మందికి కంటి పరీక్షలు చేశారు. ఇందులో 40 మంది కాటరాక్ట్ కేసులు, 60 మందికి కంటిఅద్దాలు పడతాయని హైమనేత్రాలయం ఆప్తాలమిక్ అసిస్టెంట్ రఘురాం తెలిపారు. కార్యక్రమానికి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం డాక్టర్ జగదీష్‌నాయక్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం సిబ్బంది హైమనేత్రాలయం తుని పాయకరావుపేట సిబ్బంది పాల్గొన్నారు.


ఎపి జెన్కో కాలనీలో ఇంటి పైకప్పుపై ఉన్న కోతులు

కోతుల బెడద తప్పించండి

ప్రజాశక్తి-సీలేరు: కోతుల బెడద తప్పించాలని ప్రజలు వేడుకుంటున్నారు. జికె వీధి మండలం సీలేరులో కోతులు పెరిగిపోతుండడంతో ప్రజలకు తలనొప్పిగా మారింది. ఇళ్లలోకి ప్రవేశించి సామాన్లు చిందరవందర చేస్తూ ఆహారపదార్థాలు ఎత్తుకుపోతున్నాయి. వాటిని చెదరగొట్టేందుకు ప్రయత్నిస్తే వారిపై దాడి చేస్తున్నాయి. దుకాణాల్లో చొరబడి సామాన్లు ఎత్తుకుపోయి ఇంటిపై కప్పులపై కూర్చుని ఆరగిస్తు న్నాయి. విద్యుత్ స్తంభం నుంచి ఇళ్లకు వెళ్లే సర్వీస్‌వైర్లు తెంపేస్తున్నాయి. దీంతో ప్రజల కు కంటిమీద కునుకు లేకుండా పోతోంది. సిమెంట్ రేకులు పగలగొట్టి ప్రజలను విసిగిస్తున్నాయి. ఒకప్పుడు వందల సంఖ్యలో ఉన్న కోతులు ఇప్పుడు సుమారు 1000 వరకు పెరిగిపోయాయి. ఎపి జెన్కో కాలనీ, దుర్గావీధి, అల్లూరివీధి, శ్రీనివాసనగర్, శివాలయంవీధి, ఫిష్ మార్కెట్, కుమ్మరివీధి సిపిహెచ్ క్యాంపు శ్రీనివాసనగర్‌లో విచ్చలవిడిగా సంచారం చేస్తూ ప్రజలను తీవ్ర భయాందోళనకు గురి చేస్తున్నాయి. ఎపి జెన్కో కార్మికుల కాలనీ ఇంజనీర్లు నివాసం ఉంటున్న అపార్ట్‌మెంట్లపై వీరవిహంగం చేస్తూ ఇబ్బందులకు గురి చేస్తున్నాయి. కోతుల బెడద నివారించాలని ఎపి జెన్కో హైడల్ డైరెక్టర్ సుజయ్‌కుమార్, చీఫ్ ఇంజనీర్ రాజారావు దృష్టికి పత్రికా విలేకరులు తీసుకువెళ్లారు. వారు స్పందిస్తూ కింద స్థాయి అధికారులకు కోతులను తక్షణమే అదుపు చేసే విధంగా చర్యలు చేపట్టాలని ఆదేశించారు. ఇప్పటివరకు ఎటువంటి చర్యలు చేపట్టలేదు. ఇప్పటికైనా ఏపీ జెన్కో అధికారుల స్పందించి చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

పర్యాటకులకు మెరుగైన సదుపాయాలు కల్పించాలి

ప్రజాశక్తి-ఎంవిపి.కాలనీ : విశాఖకు పర్యటకులకు పెరిగిన నేపథ్యంలో విఎంఆర్‌డిఎ పరిధిలోని పర్యాటక ప్రాంతాల్లో ఎలాంటి ఇబ్బందులు లేకుండా మెరుగైన సదుపాయాలు కల్పించాలని విఎంఆర్‌డిఎ ఛైర్మన్ ఎంవి ప్రణవ్ గోపాల్ ఆదేశించారు. శనివారం ఉదయం బీచ్ రోడ్‌లో కురుసుర సబ్ మెరైన్ మ్యూజియంను ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా పర్యాటకులు ఎండలో బారులు తీరటాన్ని గమనించి, వారిని విశ్రాంతి గదిలో సేద తీరాలని సూచించారు. ఆదివారం మాత్రమే ఉదయం నుంచి తెరిచి ఉంచుతామని, మిగిలిన రోజుల్లో మధ్యాహ్నం నుంచి తెరుస్తామని అధికారులు చెప్పటంతో పర్యాటక సీజన్ కావటంతో అధిక సంఖ్యలో పర్యాటకులు బారులు తీరుతున్నారని, అందువల్ల విఎంఆర్‌డిఎ పరిధిలో అన్ని మ్యూజియంలను ఉదయం 10 గంటల నుంచే తెరవాలని ఆదేశించారు. కురుసుర సబ్ మెరైన్ మ్యూజియం బయట క్యూ లైన్ల ఏర్పాటుకు చర్యలు తీసుకోవాలన్నారు. బీచ్ రోడ్‌లో ఉన్న అన్ని మ్యూజియంల పరిసరాలు పరిశుభ్రంగా ఉంచాలని, రక్షిత తాగునీటిని అందుబాటులో ఉంచాలని ఆదేశించారు. కార్యక్రమంలో కార్యదర్శి మురళీకృష్ణ, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.


అధికారులతో మాట్లాడుతున్న విఎంఆర్‌డిఎ ఛైర్మన్ ఎంవి ప్రణవ్‌గోపాల్

నేడు రాష్ట్రస్థాయి కిక్ బాక్సింగ్ పోటీలు

ప్రజాశక్తి-విశాఖ కలెక్టరేట్ : వంగవీటి మోహనరంగా మెమోరియల్ రాష్ట్రస్థాయి కిక్ బాక్సింగ్ పోటీలు విఎంఆర్ మెమోరియల్ గ్రేటర్ విశాఖపట్నం ఆధ్వర్యాన, రేంబో పవర్ కిక్ బాక్సింగ్ అసోసియేషన్ నిర్వహణలో ఆదివారం ఉదయం 9 గంటల నుంచి నిర్వహించనున్నట్లు విశాఖ దక్షిణ ఎమ్మెల్యే వంశీకృష్ణ శ్రీనివాస్ తెలిపారు. ఇందుకు సంబంధించిన పోస్టర్‌ను శనివారం తన కార్యాలయంలో ఆయన ఆవిష్కరించారు. ఇందిరా ప్రియదర్శిని స్టేడియంలో జరగనున్న ఈ పోటీల్లో రాష్ట్రంలోని వివిధ జిల్లాల నుంచి క్రీడాకారులు పాల్గొననున్నారని పేర్కొన్నారు. అదే రోజు సాయంత్రం విజేతలకు బహుమతుల ప్రదానం చేయనున్నట్లు ఆర్గనైజర్ చీఫ్ కనకరాజు తెలిపారు. కిక్ బాక్సింగ్ క్రీడాకారులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. మరిన్ని వివరాలకు 9290175667 నెంబర్‌కు సంప్రదించాలని కోరారు.

30న జెడ్‌పి సర్వసభ్య సమావేశం

ప్రజాశక్తి-విశాఖ కలెక్టరేట్ : జిల్లా ప్రజా పరిషత్ సర్వసభ్య సమావేశం ఈ నెల 30న ఉదయం 10.30 గంటలకు చైర్‌పర్సన్ జల్లిపల్లి సుభద్ర అధ్యక్షతన స్థానిక జెడ్పీ సమావేశ మందిరంలో జరగనుందని జెడ్‌పి ముఖ్య కార్యనిర్వహణ అధికారి పి.నారాయణమూర్తి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లాలోని అన్ని విభాగాల అధికారులు పూర్తి నివేదికలతో హాజరు కావాలని విజ్ఞప్తి చేశారు. జెడ్‌పిటిసి సభ్యులు, ఎంపిపిలు అధికారులు సమావేశానికి హాజరుకావాలని కోరారు.



జాతీయ గిరిజన యువ సమ్మేళనం పోస్టర్ ఆవిష్కరిస్తున్న ఎంపి శ్రీ భరత్

30 నుండి జాతీయ గిరిజన యువ సమ్మేళనం

- నాలుగు రాష్ట్రాల నుండి ఆదివాసీలు రాక

ప్రజాశక్తి-ఎంవిపి కాలనీ : 17వ జాతీయ గిరిజన యువ సమ్మేళనం గీతం డీమ్డ్ విశ్వవిద్యాలయం వేదికగా ఈ నెల 30 నుంచి జనవరి 5వ తేదీ వరకు నిర్వహిస్తున్నట్లు మేరా యువ భారత్ డిప్యూటీ డైరెక్టర్ జి.మహేశ్వరరావు తెలిపారు. యూత్ హాస్టల్లో శనివారం ఏర్పాటు చేసిన పాత్రికేయుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ కేంద్ర హోం మంత్రిత్వ శాఖ, కేంద్ర యువజన వ్యవహారాల శాఖ సంయుక్త ఆధ్వర్యంలో జరుగు సమ్మేళనంలో ఆంధ్రప్రదేశ్, ఛత్తీస్‌గఢ్, ఒడిశా, జార్ఖండ్ రాష్ట్రాల నుంచి 200 మంది గిరిజన యువతీ యువకులు పాల్గొంటారని పేర్కొన్నారు. గిరిజన సంస్కృతి, సాంప్రదాయాలు, ఆచార వ్యవహారాలను ఇక్కడ వారికి చాటి చెప్పడమే ఈ సమ్మేళనం లక్ష్యమన్నారు. గిరిజన అభివృద్ధికి కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న పలు పథకాల గురించి కూడా తెలియజేయునున్నట్లు పేర్కొన్నారు. నాలుగు రాష్ట్రాల గిరిజన యువతీ యువకులు ఆయా ప్రాంతాల కళారూపాలను ఇందులో ప్రదర్శిస్తారని తెలిపారు. సమావేశంలో నేరయోభారత్ రిసోర్స్ పర్సన్ ఎన్ నాగేశ్వరరావు, ఎన్ఎస్ఎస్ నేషనల్ అవార్డు గ్రహీత ఆర్.లీలా ప్రసాద్ పాల్గొన్నారు.